
సాక్షి ఒడిశా

శుక్రవారం। 24। ఫిబ్రవరి। 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,08,777లు, బంగారం 250 మిల్లీగ్రాములు, వెండి 22.26 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



భూకాంప జోన్-3లో తాల్చేర్

8లో



వేర్వేరు ప్రమాదాల్లో యువకులు మృతి

- 8లో

న్యూస్‌రీల్

మాదక ద్రవ్యాల వినియోగం ప్రమాదకరం



ప్రసంగిస్తున్న వైద్యాధికారి మహాపాత్రో

రాయగడ: పొగతాగడం, తంబాకు సేవించడం వంటివి ఆరోగ్యానికి ఎంతో హానీ చేస్తాయని, వీటి నుంచి దూరంగా ఉంటే భవిష్యత్ బంగారు బాటగా సాగుతుందని జిల్లాలోని జమిడిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీల్ మహాపాత్రో హితవు పలికారు. పట్టణానికి సమీపంలోని ఉగ్రతార ఇంటర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం-దుష్పరిణామాలు అనే అంశంపై గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన ప్రసంగించారు. నేటి విద్యార్థులే దేశ భవిష్యత్‌గా మారనున్నారని, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు సేవించకూడదని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యంగా పెద్దలు చెప్పే వాక్కులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ సాహు, జమిడిపేట ఆస్పత్రి పీహెచ్‌ఈఓ సంజుక్తా బెహర తదితరులు ప్రసంగించారు.

133 కిలోల గంజాయి స్వాధీనం



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌డీపీఓ మనోజ్‌కుమార్, వెనుక నిందితులు

కొరాపుట్: జిల్లాలోని పొట్టంగి సమితిలో 133కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను పొట్టంగి పోలీస్ స్టేషన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో సునాబెడా ఎస్‌డీపీఓ మనోజ్‌కుమార్ బెహరా ప్రకటించారు. జాతీయ రహదారి 26పై రాళ్లగెడ వద్ద ఎస్‌ఐ రాజేష్ ప్రియదర్శి నాయక్ నేతృత్వంలో పోలీసులు తణిఖీలు చేపట్టారు. అదే సమయంలో అటుగా వస్తున్న బొలేరో, వెనుకే వస్తున్న మరో కారులో 133 కిలోల గంజాయి బయటపడింది. దీనిని రవాణా చేస్తున్న రాజస్థాన్‌కి చెందిన బబులా సేన్, ప్రకాష్ గుజ్జర్, పొట్టంగి సమితికి చెందిన మోహన్ కీలో, అనంత పొడాల్‌ను అరెస్ట్ చేశారు. రవాణాలో మరికొందరు ప్రమేయం ఉందని గుర్తించామని, వారి కోసం గాలిస్తున్నామని వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేయడంతో పాటు గంజాయి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ధాన్యం కుప్పలు దగ్ధం

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి జంగాలపాడు గ్రామంలో గురువారం ఉదయం కుప్పలుగా వేసిన ధాన్యం అగ్నికి ఆహుతైంది. వరి నూర్పిడులు పూర్తయి, మండీలకు తరలించేందుకు పొలంలోనే ధాన్యాన్ని భద్ర పరిచారు. అయితే గుర్తు తెలియని దుండగులు ధాన్యానికి నిప్పంటించడంతో పంట మొత్తం బుగ్గిపాలయ్యిందని రైతులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న పర్లాకిమిడి అగ్నిమాపక దళం గ్రామానికి చేరుకున్నప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఘటనపై బాధిపై రైతులు గురండి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'కీచి హొబోని' షార్ట్‌ఫిల్మ్ విడుదల



షార్ట్‌ఫిల్మ్‌ను తిలకిస్తున్న ఐఐసీ రీగాన్ కీండో, అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా పోలీసు యంత్రాంగం రూపొందించిన కీచి హొబోని షార్ట్‌ఫిల్మ్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఐసీ రీగాన్ కీండో మాట్లాడుతూ ఎంతో మంది మైనర్లు క్షనికావేశంతో ఇంట్లో పెద్దవారు ఏదో అన్నారనే మనస్థాపానిక గురై, ఇళ్లు వదిలి వెళ్లిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. అటువంటి వారికి భరోసా కల్పించాలనే ఉద్దేశంతో కీచి హొబోనీ(ఏమి అవ్వదు) అనే షార్ట్‌ఫిల్మ్‌ను చిత్రీకరించినట్లు తెలిపారు. అయితే మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ఎదురవుతున్న శిక్షలపై ఇందులో అవగాహన కల్పించామన్నారు. ఈ చిత్రాన్ని మల్కన్‌గిరి జిల్లాలోని ప్రతి పాఠశాలాలో విద్యార్థులకు చూపించాలని జిల్లా ఎస్పీ నితీష్ వాధ్వానీ ఆదేశించారని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

యుగ పురుషుడు.. గోపబంధు దాస్





ఉత్కళమణి గోపబంధు దాస్ మ్యూజియాన్ని ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్ (ఇన్‌సెట్లో) సువాండోలోని సముదాయం

- సువాండో లోని ఉత్కళమణి జన్మస్థలంలో మ్యూజియం అభివృద్ధి
- రూ.25 కోట్ల వ్యయంతో సుందర కేంద్రంగా నిర్మాణం
- ప్రజలకు అంకితం చేసిన సీఎం నవీన్ పట్నాయక్
- ఆదర్శ వ్యక్తుల జన్మస్థలాల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడి

భువనేశ్వర్: పూరీ జిల్లా సువాండోలో ఉత్కళమణి పండిత్ గోపబంధు దాస్ జన్మస్థలం మ్యూజియంగా పునరుద్ధరించి, రాష్ట్ర ప్రజలకు అంకితం చేశామని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 15 అడుగుల గోపబంధు దాస్ విగ్రహం, మ్యూజియంను గురువారం ప్రారంభించారు. ఉత్కళమణి మానవ సమాజ రత్నమని నివాళులర్పించారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఏడు ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి పరిచిన లోకేశ్వర్ ఆలయాన్ని సీఎం సందర్శించారు. ఆలయంలో పరమ శివునికి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోపబంధు దాస్ యుగ పురుషుడని కొనియాడారు. రాష్ట్ర ప్రజలు ఆయనకు ఎల్లవేళలా రుణపడి ఉంటారన్నారు. దాస్ జ్ఞాపకార్థం ఏది చేసినా తక్కువే అవుతుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. 5టీ కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర వర పుత్రుల జన్మ స్థలాలను రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్, కెప్టెన్ ఫకీర్ మోహన్, గంగాధర్ మెహర్, షహీద్ లక్ష్మణ్ నాయక్ వంటి వీరుల త్యాగాలు ఒడిశా వైభవానికి చారిత్రాత్మక వన్నె దిద్దాయని గుర్తు చేసుకున్నారు. 'సేవ, త్యాగం, దేశభక్తి అసమానమైనవి. స్వాతంత్ర్య పోరాటం నుంచి విద్య, సాహిత్య సంస్కృతి, రాజకీయాలు, సేవ, మానవత్వ రంగాల్లో గోపబంధు సాటి లేని విలువలను చాటుకున్నారు. రాష్ట్రంలో జాతీయవాద స్ఫూహ అభివృద్ధికి మార్గదర్శకుడిగా నిలిచారు. స్వీయ ఆనందం కంటే త్యాగం గొప్పదని, సేవ శ్రేష్ఠమైనదనే జీవన శైలితో మానవాళికి గొప్ప బంధువుగా నిలిచా'రని ముఖ్యమంత్రి కొనియాడారు. ఆయన సర్వదా స్ఫూర్తిదాయకమని, గోపబంధు దాస్ భార్గవి తీర్మానం నూతన శక్తివంతమైన ఒడిశా నిర్మాణ శైలిగా కొనసాగుతుందని వివరించారు.

ఆకట్టుకున్న చిత్రాలు..

గోపబంధు దాస్ జన్మస్థలం అభివృద్ధికి సహకరించిన ఉత్కళమణి కుటుంబీకులు, సువాందో గ్రామస్తులు, పూరీ జిల్లా యంత్రాంగం, రాష్ట్ర సాంస్కృతిక శాఖకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి గోపబంధు దాస్ మనవడు ధీరేంద్రకుమార్ దాస్ హాజరయ్యారు. ఇటువంటి చర్యలు రాష్ట్రంలో మహాపురుషుల బాటలో పయనించేలా వర్ధమాన తరాలను ప్రోత్సహిస్తాయని తెలిపారు. గోపబంధు దాస్ పూర్వీకుల ఇల్లు పునరుద్ధరించి మ్యూజియంగా తీర్చిదిద్దడంతో ఆయన జీవిత కాలపు విశేష ఘట్టాల స్మారక కేంద్రంగా ఈ మ్యూజియం వెలుగొందుతోందని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ మ్యూజియంలో గోపబంధు ఉపయోగించిన అనేక వస్తువులు, పుస్తకాలు, కొన్ని అరుదైన ఛాయాచిత్రాలు పదిల పరిచారన్నారు. పునరుద్ధరించిన మ్యూజియం అన్ని గదులతో దాస్ జన్మించిన 'సాథీ ఘురో'ను ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా సందర్శించి, ఆనందం వ్యక్తంచేశారు.

5టీ శాఖ పర్యవేక్షణలో..

పర్యాటకులను ఆకట్టుకునేందుకు సువాందోలో అనేక ప్రజా సౌకర్యాల్ని అభివృద్ధి చేశారు. భార్గవి నది ఒడ్డున శివాలయం, పార్క్, పిల్లల ఆటస్థలం, క్యాంటీన్, చెరువు, షాపింగ్ కాంప్లెక్స్ ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై స్వాగత కేంద్రం, సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 5టీ శాఖ పర్యవేక్షణలో ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ నుంచి రూ.25 కోట్ల వ్యయంతో ఉత్కళమణి గోపబంధు దాస్ జన్మస్థలాన్ని మ్యూజియంగా మలిచారు.



ఉత్కళమణి సాథీ ఘురో సందర్శనలో ముఖ్యమంత్రి



గోపబంధు వినియోగించిన సామగ్రి వివరాలను సీఎం నవీన్‌కు తెలియజేస్తున్న మనవడు ధీరేంద్రకుమార్ దాస్

భువనేశ్వర్-దుబాయ్ మధ్య విమానాలు



- ఉత్కళ్ దివస్ నుంచి రాకపోకలు

భువనేశ్వర్: ఈ ఏడాది ఉత్కళ దివస్ పురస్కరించుకుని రాష్ట్ర ప్రజల దీర్ఘకాల కోరిక తీరనుంది. ఈ సందర్భంగా ఏప్రిల్ 1నుంచి భువనేశ్వర్, దుబాయ్ మధ్య తొలి ప్రత్యక్ష అంతర్జాతీయ విమానయాన సదుపాయం అందుబాటులోకి రానుంది. మూడు ముఖ్యమైన నగరాల మధ్య అంతర్జాతీయ విమానాలు నడపడానికి అర్హత పొందిన ఇండిగో విమానయాన సంస్థ ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసింది. గత ఏడాది డిసెంబర్ 27న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ బిడ్‌ను ఆమోదించింది. ఇండిగో సంస్థ తొలిసారిగా దుబాయ్‌కి ప్రత్యక్షంగా విమానాలను నడపనుంది. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం(బీపీఐఏ) టెర్మినల్-2 పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నందున విమాన టిక్కెట్ బుకింగ్ ఇంకా ప్రారంభం కాలేదని తెలిపింది. నెల రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేసి, ఏప్రిల్ 1నుంచి దుబాయ్‌కి విమాన సర్వీసులు ప్రారంభించాలని రాష్ట్ర రవాణాశాఖ యోచిస్తోంది. రానున్న రోజుల్లో సింగపూర్, బ్యాంకాక్ లకు ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని ఈ విభాగం వెల్లడించింది.

క్రీడలకు పెద్దపీట



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నెక్కంటి భాస్కరరావు

- రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు



ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ నెక్కంటి, వేదికపై చక్ర బిడ్డిక, సామల్, తిరుపతి

రాయగడ: రాష్ట్రప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందని, ఈ సదావకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకుని ఉత్తమ ప్రతిభను కనబరచాలని రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు అన్నారు. సదర్ సమితి భైరాగి హలువాలో గత 3 రోజులుగా కొనసాగుతున్న వాలీబాల్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఇందులో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా ఇన్‌డోర్ స్టేడియాలు, క్రీడా మైదానాలను నిర్మిస్తోందని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వారి ప్రతిభను చాటుకునేందుకు ఇటువంటి పోటీల్లో చురుగ్గా పాల్గొవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేడీ సీనియర్ నాయకులు చంద్రకాంత్ సామల్, బనఘటి తిరుపతి, చక్రధర బిడ్డిక తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. 3రోజులు జరిగిన ఈ టోర్నమెంట్‌లో సమితి లోని 16 జట్లు పాల్గొన్నాయి. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుర్రాజుగుడపై జయరాంగుడ విజయం సాధించింది. విన్నర్ జట్టుకు రూ.17 వేలు ట్రోఫీ, రన్నరప్‌కు రూ.12 వేల నగదు బహుమతి అంగదించారు.

బొడో జాతరపై సన్నాహక సమావేశం

మల్కన్‌గిరి: జిల్లాలో మార్చి 4 నుంచి 7వరకు జరగనున్న బొడో జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ అక్షయ్ ఖేముండు సూచించారు. జాతర ఏర్పాట్లకు సంబంధించి సన్నాహక సమావేశం స్థానిక కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భోజనం, తాగునీటి సదుపాయం కల్పించాలని తెలిపారు. మార్చి 4న దేవతామూర్తులు కళాశాల కూడలి వద్దకు చేరుకుంటాయని వెల్లడించారు. 5న మడియాబట్ కూడలి వద్ద, బాలరాజ్, కన్నంరాజ్, పోతురాజ్, మా ముత్యాలమ్మ, 6, 7 తేదీల్లో మౌలిమ్మ మందిరం వద్ద పూజలు జరగనున్నాయన్నారు. ప్రతి కూడలి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఐఐసీ రీగాన్ కీండో, తహసీల్దార్ షబ్బీర్ ఖాన్, డీఐపీఆర్ ప్రమీలా మాఝి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సబ్ కలెక్టర్ అక్షయ్ ఖేముండు, అధికారులు

రాష్ట్రంలో కేంద్ర నిధులు పక్కదారి

- మాజీమంత్రి మన్‌మోహన్ సామల్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి మన్‌మోహన్ సామల్



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

బరంపురం: కేంద్రప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి విడుదల చేస్తున్న నిధులను బీజేడీ ప్రభుత్వం కాజేస్తోందని మాజీమంత్రి, బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్‌మోహన్ సామల్ ఆరోపించారు. నగరంలోని ఇంజినీరింగ్ స్కూల్ రోడ్ జంక్షన్‌లో ఉన్న అటవీశాఖ అతిథి గృహంలో బీజేపీ గంజాం జిల్లాస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బిభుతి జెనా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిపై ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేకంగా దృష్టి సారించారని, వివిధ ప్రజా సంక్షేమ పథకాల కింద ఏట కోట్లాది రూపాయల నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. అయితే ఒడిశా ప్రభుత్వం, అధికార పార్టీ నాయకులు నిధులను తమ పార్టీ పేరుతో పథకాలు అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. గత 23 ఏళ్ల నవీన్ పాలనలో రాష్ట్రప్రజలు పూర్తిగా విసిగి పోయారని, దీనిని పార్టీ నాయకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృగిభక్షి పాత్రో, నగర అధ్యక్షుడు కన్ను చరణ్‌పతి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ టు కొరాపుట్

- తెలంగాణా-ఒడిశా మధ్య 23ఆర్‌టీసీ బస్సులు
- ఒప్పంద పత్రాలు మార్చుకున్న ఇరు రాష్ట్రాల అధికారులు



ఓఎస్‌ఆర్‌టీసీ బస్సు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న టీఎస్ ఆర్‌టీసీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఎండీ సజ్జనార్, ఓఎస్‌ఆర్‌టీసీ ఓఎస్‌డీ దినేష్‌కుమార్

కొరాపుట్: అవిభక్త కొరాపుట్ జిల్లాల ప్రయాణికులకు శుభవార్త లభించింది. ఈ ప్రాంతం నుంచి సుదూర ప్రయాణాలు చేసేవారికి సౌలభ్యం కల్పించేందుకు తెలంగాణా-ఒడిశా ప్రభుత్వాలు ముందుకు వచ్చాయి. ఈ మేరకు హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో గురువారం జరిగిన ఒప్పంద సమావేశంలో ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. తెలంగాణా ఆర్‌టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎండీ వీసీ సజ్జనార్, ఒడిశా ఆర్‌టీసీ ఓఎస్‌డీ దినేష్‌కుమార్ పటన్నాయక్ ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం జయపురం, నవరంగ్‌పూర్, రాయగడ, భవానీపట్న నుంచి హైదరాబాద్, భద్రాచలం, కరీంనగర్ లకు బస్సు సర్వీసులు ప్రారంభిస్తారు. ఇందులో టీఎస్ ఆర్‌టీసీ 10 బస్సులు, ఓఎస్ ఆర్‌టీసీ 13బస్సులు నడపనున్నాయి. గతంలో ఈ ప్రాంతవాసులు హైదరాబాద్ వెళ్లాలంటే విశాఖపట్నం వెళ్లి, అక్కడి నుంచి ప్రయాణించాల్సి వచ్చేది. మల్కన్‌గిరి జిల్లా మెటు వద్ద బీఎస్‌ఎఫ్ భద్రత దళం సాయంతో వంతెన నిర్మించడంతో కొత్త మార్గం ఏర్పడింది. దీంతో అనేక ప్రైవేటు బస్సులు సర్వీసులు నిర్వహిస్తున్నాయి. ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉండటంతో ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగాయి. యుద్ధ ప్రాతిపదికన ఈ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ప్రస్తుత ఒప్పందం ప్రకారం హైదరాబాద్-జయపురం 2, ఖమ్మం-రాయగడ 2, భవానీపట్న-విజయవాడ(వయా భద్రాచలం) 2, భద్రాచలం-జయపురం 4 బస్సులను తెలంగాణా ఆర్‌టీసీ నడపనుంది. నవరంగ్‌పూర్-హైదరాబాద్ 4, జయపురం-హైదరాబాద్ 2, భవానీపట్న-విజయవాడ(వయా భద్రాచలం) 2, రాయ గడ-కరీంనగర్ 2, జయపురం-భద్రాచలం 3 సర్వీసులను ఒడిశా ఆర్‌టీసీ నిర్వహించనుంది. మొత్తంగా రాష్ట్రంలో తెలంగాణ ఆర్‌టీసీ 3378 కిలోమీటర్ల మేర బస్సు సర్వీసులు, తెలంగాణాలో ఓఎస్ ఆర్‌టీసీ 2896 కిలోమీటర్ల దూరం బస్సులు నడపనున్నాయి. ఒప్పంద కార్యక్రమంలో ఓఎస్‌ఆర్‌టీసీ ఓఎస్‌డీ దీప్తి మహాపాత్రో, ట్రాన్స్‌పోర్టు ప్లానర్ సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శతచండీ యాగం


శతచండీయాగం చేస్తున్న రుత్వికులు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైరవ (పీఠం)దేవాలయం వద్ద ఐదు రోజుల పాటు జరిగే శత చండీయాగం గురువారం ప్రారంభమైంది. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో 25 మంది రుత్వికులతో జరిగిన ఈ యాగంలో పూజలు, సూర్యనమస్కారాలు, వేదపారాయణలు, మహాలింగార్చనలు, మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకాలు జరిగాయి. కంచి కామకోటిపీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి మహాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకం, త్రికాలార్చనలు చేశారు. పూజా కార్యక్రమాలకు విచ్చేసిన స్వామీజీని ఎస్పీ రాధిక, ఏఎస్పీ విఠలేశ్వరరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన రావు తదితరులు దర్శించుకున్నారు.

'కిందిస్థాయి ఉద్యోగులపై వేధింపులు ఆపాలి'


నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: తపాలా శాఖలో ఆచరణ సాధ్యం కాని టార్గెట్ల పేరుతో ఉన్నతాధికారులు కింది స్థాయి ఉద్యోగులను వేధిస్తున్నారని, వీటిని వెంటనే ఆపాలని ఆంధ్రప్రదేశ్ తపాలా ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. తపాలా శాఖలో ఉన్నతాధికారుల వేధింపులకు నిరసనగా జిల్లా వ్యాప్త కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీకాకుళంలోని ప్రధాన తపాలాశాఖ కార్యాలయం వద్ద తపాలా ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ తపాలా శాఖలో టార్గెట్ల పేరుతో అధికారులు ఉద్యోగులపై ఒత్తిడి చేయడం తగదన్నారు. ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక మచిలీపట్నంలో ఒక సబ్ పోస్ట్‌మాస్టర్ గుండెపోటుతో అకాలమరణం చెందారన్నారు. ఇప్పటికైనా అధికారులు వేధింపులు ఆపకపోతే మార్చి 10వ తేదీన దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానులలో ఒకరోజు ధర్నా కార్యక్రమాన్ని, మార్చినెల 13వ తేదీన న్యూఢిల్లీలోని డాక్‌భవన్ ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టాలని ఉద్యోగ సంఘాలు నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్ ఉద్యోగ సంఘాల నాయకులు గణపతి, బాబూరావు, జ్యోతీశ్వరరావు, వేణుగోపాలరావు, బాబూరావు, చంద్రకిరణ్, వెంకటేష్, రాంబాబు, రమేష్, ఢిల్లేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

● అరుదైన గుడ్లగూబ




పాతపట్నం రామాలయం వీధిలో ఉపాధ్యాయుడు అల్లాడ అప్పలస్వామి ఇంట్లోకి గురువారం ఉదయం అరుదైన గుడ్లగూబ చొరబడింది. సాధారణంగా గుడ్లగూబలు రాత్రివేళ మాత్రమే తిరుగుతాయి. ఈ గుడ్లగూబ మాత్రం పగటి పూటే కనిపించడం, పొడవాటి ముక్కు, గోధుమ రంగులో మెరవడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. అరగంట తర్వాత ఎగిరిపోయిందని ఉపాధ్యాయుడు తెలిపారు. - పాతపట్నం

భూకంప జోన్-3లో తాల్చేర్



- అసెంబ్లీలో ప్రకటించిన విపత్తు నిర్వహణ మంత్రి ప్రమీలా
- మూడో సజావుగా సాగిన ప్రశ్నోత్తరాల సమయం

భువనేశ్వర్: టర్కీ, సిరియా దేశాల్లో దాదాపు 50,000మంది మృతికి కారణమైన విధ్వంసకర భూకంపాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అంగుల్ జిల్లాలోని తాల్చేర్, పరిసర ప్రాంతాలు 'మోడరేట్ డ్యామేజ్ రిస్క్' జోన్‌లో ఉన్నాయని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి ప్రమీలా మల్లిక్ గురువారం శాసన సభలో ప్రకటించారు. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ(ఎన్‌డీఎంఏ), బిల్డింగ్ మెటీరియల్స్ అండ్ టెక్నాలజీ ప్రమోషన్ కౌన్సిల్(బీఎంటీపీసీ) 2006లో విడుదల చేసిన 'భూకంప ప్రమాదాల జోనింగ్ అట్లాస్ ఆఫ్ ఇండియా సంచిక ప్రకారం.. తాల్చేర్ మండలం, పరిసర ప్రాంతాలు భూకంప జోన్-3 కేటగిరీ కిందకు వస్తాయని తెలిపారు. ఇది మోస్తరు నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రెంగాలి నియోజకవర్గ ఎమ్మెల్యే నౌరీ నాయక్ అడిగిన ప్రశ్నకు మంత్రి మల్లిక్ సమాధానమిచ్చారు. సత్వర సహాయక, పునరుద్ధరణ, పునర్నిర్మాణ రంగాల్లో అనుబంధ వర్గాలకు పటిష్టమైన శిక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే భూకంపనతో కూలిన ఇండ్లు, ఇతర కట్టడాలు, శిథిలాల్లో గాలింపు, తక్షణ సహాయక చర్యల సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చామన్నారు. గాలింపు, సహాయక కార్యకలాపాలను నిర్వహించేందుకు అనుబంధ పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయని భరోసా ఇచ్చారు. వివిధ మండలాల్లో భూకంపాలను తట్టుకునే గృహాల నిర్మాణానికి మార్గదర్శకాలు జారీ చేసినట్లు వివరించారు.


మహానది

గోపాల్‌పూర్ ఎమ్మెల్యే వాకౌట్

భువనేశ్వర్: సభలో సభాపతి పక్షపాత వైఖరిని ఆరోపిస్తూ గోపాల్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాణిగ్రాహి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్పీకర్ సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, స్పీకర్ విక్రమ్‌కేశరి అరుఖ్ ఆదేశాల మేరకు తన ఖాతాలో ఎమ్మెల్యే నిధులను ఖర్చు చేయకుండా జిల్లా కలెక్టర్ నిలిపి వేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే నిధుల ఖర్చుపై అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో చర్చ సందర్భంగా ప్రదీప్ పాణిగ్రాహి తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రజా ప్రయోజనాల పట్ల సభాపతి అనుకూలంగా ఉన్నట్లు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యుడిని మాట్లాడనివ్వక పోవడం సభకు అవమానంగా అభివర్ణించారు. 'గంజాం జిల్లా నుంచే ముఖ్యమంత్రి, స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అదే జిల్లాలో భాగమైన తన నియోజకవర్గ పురోగతికి మాత్రం నిధులు ఖర్చు చేయవద్దని జిల్లా కలెక్టర్‌కు సీఎం ఆదేశించడం పక్షపాత వైఖరికి నిదర్శన'మని పేర్కొన్నారు. గోపాల్‌పూర్ అభివృద్ధి కార్యక్రమాలను ఉద్దేశపూర్వకంగా అమలు చేయడం లేదన్నారు. ఈ పరిస్థితులతో సభా కార్యక్రమాలకు హాజరు కావడం పట్ల సందిగ్ధత నెలకొందని విచారం వ్యక్తం చేశారు.

జలవనరుల శాఖపై చర్చ..

భువనేశ్వర్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల మూడో రోజు సభా కార్యక్రమాలు సజావుగా సాగాయి. ప్రశ్నోత్తరాలు ప్రశాంతంగా ముగిశాయి. తాగునీటి సరఫరా, నీటి పారుదల, నీటి సంరక్షణపై సభలో ప్రశ్నోత్తరాల చర్చ రసవత్తరంగా కొనసాగింది. రెండు రోజుల తరువాత ప్రశ్నోత్తరాల సమయం సాధారణమైంది. పద్మనాభ్ బెహరా అడిగిన ప్రశ్నకు జల వనరులశాఖ మంత్రి టుకుని సాహు సమాధానమిస్తూ.. మహానది బేసిన్ లోని ఖైర్‌మల్, గోధనేశ్వర్, కపాశిర వద్ద బ్యారేజీలు నిర్మించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టంచేశారు. ఖైర్మల్, గోధనేశ్వర్‌లో ఇన్‌స్ట్రీమ్ స్టోరేజ్‌ను మాత్రమే నిర్మించాలని యోచిస్తోంది. ఇన్‌స్ట్రీమ్ స్టోరేజీ లేకపోతే మెగాలిఫ్ట్ పాయింట్ పెంచి, సాగునీరు ఎలా ఇస్తారని పద్మనాభ్ బెహరా అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే వర్షం కురిసే రోజుల్లో కూడా ఎగువన గేటు మూసి వేస్తుండటంతో నీరు రావడం లేదన్నారు. అదేవిధంగా, ప్రభుత్వం గత ప్రకటనను అమలు చేయకపోవడం పట్ల భారతీయ జనతాపార్టీ ఎమ్మెల్యే భాస్కర్ మొఢై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేష్‌కుమార్ రౌత్రాయ్ భువనేశ్వర్ తాగునీటి సరఫరా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో ఛత్తీస్‌ఘఢ్ ప్రభుత్వం డ్యాం నీటి విడుదల అడ్డుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

కొఠియాలో చొరబాటుపై సమాచారం లేదు

భువనేశ్వర్: కొరాపుట్ జిల్లా పొట్టంగి మండలం కొఠియాలో ఆంధ్రప్రదేశ్ ఆక్రమణలపై వార్తలు వెలుగు చూస్తున్నాయి. ఆంధ్రా అధికారులు కూడా ఒడిశాలో విడిది చేస్తున్నారు. అయితే ఈ అంశంపై రాష్ట్రప్రభుత్వం వద్ద ఎటువంటి సమాచారం లేదని రెవెన్యూ మంత్రి ప్రమీలా మల్లిక్ సమాధానమిచ్చారు. 2021లో కొఠియాలో ఆంధ్రా అధికారులు ఎన్నిసార్లు చొరబడ్డారో చెప్పాలని అసెంబ్లీలో భారతీయ జనతాపార్టీ సభ్యురాలు కుసుమ్ టెట్టే అడిగిన ప్రశ్నకు ఆమె పైవిధంగా స్పందించారు. 2021 నుంచి ఆంధ్రా ద్వారా అలవెన్సులు, రేషన్ పంపిణీ లేదా రోడ్ల నిర్మాణానికి సంబంధించిన సమాచారం జిల్లా యంత్రాంగం వద్ద లేదని తెలిపారు. ఆంధ్రా వైపు నుంచి ఇక్కడ రోడ్డు నిర్మించలేదని, అలాంటి కార్యకలాపాలను గమనిస్తే.. రాష్ట్రప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

రక్తదానంతో ప్రాణదానం


శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎస్పీ జగ్‌మోహన్ మీనన్

- కలెక్టర్ దివ్యజోతి పరిడా

బరంపురం: ప్రాణాపాయ పరిస్థితుల్లో సకాలంలో రక్తం అందక పోవడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని గంజాం జిల్లా కలెక్టర్ దివ్యజోతి పరిడా తెలిపారు. ఆరోగ్యవంతులైన యువతీ, యువకులు రక్తదానం చేయడం ద్వారా ఆ లోటును భర్తీని చేసి, క్షతగాత్రుల ప్రాణాలను రక్షించవచ్చని పిలుపునిచ్చారు. జిల్లాలోని అస్కా పట్టణంలో ఉన్న జిల్లా పోలీసు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం గురువారం జరిగింది. కలెక్టర్ దివ్యజోతి పరిడా, జిల్లా ఎస్పీ జగ్‌మోహన్ మీనన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమయాల్లో దుర్ఘటనలకు గురైన వారు రక్తం లభించక మృతి చెందుతున్న ఘటనలు దురదృష్ట కరమన్నారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా మరిన్ని శిబిరాలు నిర్వహించి, ఆపద స్థితిలో ఉన్నా వారి ప్రాణాలు కాపాడాలని సూచించారు. అనంతరం ఎస్పీ జగ్‌మోహన్ స్వయంగా రక్తదానం చేసి, ఆదర్శంగా నిలిచారు. అనంతరం రక్తదానం చేసిన వారికి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలతో గౌరవంగా సత్కరించారు. శిబిరంలో జిల్లాకు చెందిన ఎస్‌డీపీఓలు, ఐఐసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


రక్త దాతలకు ప్రశంసాపత్రంతో అభినందిస్తున్న కలెక్టర్ దివ్యజోతి పరిడా

సరిహద్దులో ఎక్సైజ్ సిబ్బంది దాడులు


స్వాధీనం చేసుకున్న సారాతో పట్టుబడిన నిందితులు

- 674 లీటర్ల సారా పట్టుకున్న ఇరు రాష్ట్రాల అధికారులు

రాయగడ: ఆంధ్ర, ఒడిశా పరిహద్దు ప్రాంతాల్లో ఎక్సైజ్‌శాఖ అధికారులు గురువారం విస్తృత దాడులు నిర్వహించారు. సరిహద్దు ప్రాంతాలైన సనోసందుబడి, శిఖాబడి గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో 674 లీటర్ల సారా, 6,100 లీటర్ల ఊట, 200 కిలోల విప్పమొగ్గ స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో శిఖబడి, సనోసందుబడి గ్రామాలకు చెందిన రాజు గంట(45), పులొంతి గంట(34), రత్నాలు కృష్టారావు(50) ఉన్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అభిరాం బెహరా తెలిపారు. కొద్ది నెలలుగా ఇరు రాష్ట్రాల సరిహద్దులోని గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నారు. సారా తయారు చేసి, పొరుగు రాష్ట్రమైన పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఇరు రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఇందులో ఆంధ్రకు చెందిన 39మంది, రాయగడ జిల్లాకు చెందిన 65మంది తోపాటు శెశిఖల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన 10మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా సిబ్బంది అంతా కలిసి శెశిఖల్ పోలీస్ స్టేషన్‌లో సమావేశమై, దాడులకు వ్యూహం రచించారు. అనంతరం 3బృందాలుగా విడిపోయి, రెండు గ్రామాల్లో మూకుమ్మడిగా దాడులను నిర్వహించారు. సారా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ఇటువంటి దాడులు తరచూ నిర్వహించి, సరిహద్దుల్లో పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామని ఎస్పీ వివరించారు.


దాడుల్లో పాల్గొన్న ఇరు రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్‌శాఖ అధికారులు

వేర్వేరు ప్రమాదాల్లో యువకులు మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు


రోడ్డుపై హికాక మృతదేహం

రాయగడ: వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన దుర్ఘటనల్లో రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు మృతిచెందారు. మరొకరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే... జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ధమునిపొంగ పంచాయతీ బావుడుగ గ్రామానికి చెందిన అజయ్ హికాక(24) మృతిచెందాడు. దేవగిరి శైవక్షేత్రంలో కొనసాగుతున్న శివరాత్రి ఉత్సవాలను తిలకించేందుకు బుధవారం రాత్రి బైక్‌పై వెళ్లిన అతను.. గురువారం వేకువజామున ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కల్యాణ సింగుపూర్ మెయిన్ రోడ్డు వద్ద బైకు అదుపు తప్పడంతో సమీపంలో ఉన్న కంకర రాళ్లపై పడి తలకు తీవ్రగాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం అటువైపుగా వెళ్లిన వాహనదారులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేశారు.

వేటకు వెళ్లి..

రాయగడ: తోటి మిత్రులతోసమీపంలోని అడవిలోకి వేటకు వెళ్లిన యువకుడు అదే వేటగాళ్ల తూటాలకు బలైన విషాద ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి బంగుపాదు గ్రామంలో చోటు చేసుకుంది. పర్శాలి పంచాయతీకి చెందిన కొందరు యువకులు నియమగిరి కొండలపై వేటకు చేసేందుకు బుధవారం రాత్రి వెళ్లారు. సమితిలోని కూలి పంచాయతీ మొండిబాలి గ్రామానికి చెందిన బుటు జకసికా(25) వారిని అనుసరించాడు. జంతువుల వేటాడే ప్రక్రియలో అంతా చెరో దిక్కుకు వెళ్లారు. ఇంతలో తుపాకీ గుండు జకసికాకు శరీరం నుంచి దూసుకు పోవడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న తోటి యువకులు రక్తపు మడుగులోపడి ఉన్న బాధితుడిని వెంటనే కల్యాణ సింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిన లారీని ఢీకొని..


ఆస్పత్రిలో జకసిక మృతదేహం


భామిని: తిరుపతిరావు మృతదేహం

భామిని: మండలంలోని కొరమ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం గవదపేటకు చెందిన రేగాన తిరుపతిరావు(25) ప్రమాద స్థలంలోనే మరణించాడు. పెద్దదిమిలి ఎండల మల్లన్న యాత్రను చూసేందుకు స్నేహితుడితో కలిసి తిరుపతిరావు వెళ్లి, తిరిగి స్వగ్రామానికి వస్తూ రోడ్డుపై ఆగి ఉన్న ఇసుక లారీ వెనుక భాగాన్ని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. బైక్‌పై ఉన్న మరో యువకుడు ఒడిశాలోని ఉక్కంబకు చెందిన నిమ్మల కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా వైద్య సేవలు పొందుతున్నాడు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే బత్తిలి ఎస్ఐ వై.అమ్మాన్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన ఇసుక లారీని బత్తిలి స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి యువకుడి మృతదేహానికి పాలకొండ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత జవాన్ మృతి


మృతుడు వరప్రసాద్ (ఫైల్)


ఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

టెక్కలి రూరల్: స్థానిక పాత రవి ధాబా వద్ద గల వే బ్రిడ్జి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం దేవలబద్ర గ్రామానికి చెందిన విశ్రాంత బీఎస్ఎఫ్ జవాను పట్నాన వరప్రసాద్(42) మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వర ప్రసాద్ తన వ్యక్తిగత పనుల కోసం బైక్‌పై టెక్కలి వచ్చి తిరిగి వెళ్తుండగా పాత రవిధాబా వద్ద అప్రోచ్ రోడఉడలో వెనుక నుంచి ధాన్యం లోడుతో వస్తున్న మ్యాక్సీ పికప్ వాహనం ఢీకొట్టడంతో వర ప్రసాద్ బండిపై నుంచి తుళ్లి పడిపోయాడు. వ్యాన్ అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడకక్కడే ప్రాణాలు పోయాయి. విషయం తెలుసుకున్న టెక్కలి ఎస్ఐ రామకృష్ణ, ఎస్ఐ-2 రమేష్‌బాబులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవ పంచనామా కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పద్మ, పదేళ్ల కుమార్తె లాస్య, ఎనిమిదేళ్ల కుమార్తె కావ్యలు ఉన్నారు.

అన్న దేశం కోసం చనిపోయాడు..

మృతుడు వరప్రసాద్ అన్నయ్య జోగులు కూడా ఆర్మీలో పనిచేశారు. రెండేళ్ల కిందట జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఫైరింగ్‌లో ఆయన వీర మరణం పొందారు. అప్పుడు మనస్తాపానికి గురైన వర ప్రసాద్ ఏడాది కిందటే ఉద్యోగానికి వాలంటరీ రిటైర్‌మెంట్ ఇచ్చేసి స్వగ్రామానికి తిరిగి వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదంలో రూపంలో ముంచుకువచ్చిన మృత్యువు అతడిని తీసుకెళ్లిపోవడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మొగలిపువ్వు తెంపటానికి అధికారము

1. ఈ ప్రకటన ద్వారా గోపాల్‌పూర్ మిలటరీ స్టేషన్ డిఫెన్స్ భూమిలో [illegible] మొగలి పువ్వుల [illegible] పువ్వులు తెంపటానికి అధికారము [illegible] ఈ ధరకు నియమించిన తేదీ: 15 ఏప్రిల్ 2023 నుండి 14 ఏప్రిల్ 2024 వరకు ఉంటుంది.
2. దీనికి [illegible] నియమ నిబంధనలు గల ఫారములు 'Q' Branch, Head Quarter, Army AD College నుండి తేదీ: 11 మార్చి 2023 నుండి 18 మార్చి 2023 ఉదయం 9.00 గంటల నుండి 13.00 గంటల వరకు [illegible]. ఈ ఫారము తీసుకొనుటకు [illegible] రూ.500/- [illegible]
3. [illegible]
4. ఈ ఫారము [illegible] "BID FOR PLUCKING RIGHTS OF KEWRA". అని పై భాగమున వ్రాయవలెను. [illegible] Head Quarter Army AD College. Pin 928 902 C/o. 99 APO [illegible]
5. ఈ ఫారమును 'Q' Branch, Head Quarter Army AD College లో ఉన్న Seal Box లో వేయవలెను. ఈ Box లో వేయవలసిన తేదీ 01 ఏప్రిల్ 2023 నుండి 08 ఏప్రిల్ 2023 వరకు ఉదయం 9.00 గంటల నుండి 13.00 గంటల వరకు వేయవలెను. [illegible] Head Quarter Army AD College కి [illegible] 08 ఏప్రిల్ 2023 13.00 గంటల లోపు చేరవలెను. [illegible]
6. [illegible] 'Q' Branch, Head Quarter Army AD College లోఉన్న Boxలో వేయవలెను.
7. ఫారం Box తెరుచుటకు నియమించిన సమయం తేదీ 10 ఏప్రిల్ 2023 ఉదయం 10.00 గంటలకు [illegible] Board of Officers ద్వారా [illegible]

కల్నల్ 'క్యూ'
ముఖ్యాలయ సేనా వాయు రక్షణ కాలేజ్ ద్వారా 99 సేనా తపాల సంస్థ

ఆదివాసీ విద్యార్థులను ఆదుకుంటాం

- ఎస్‌డీసీ చైర్మన్ల సత్కార సభలో రాష్ట్ర సలహాదారు ప్రదీప్ మాఝి


సంప్రదాయ వాయిద్యాల నడుమ ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు, నాయకులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాకు నూతనంగా ఎన్నికైన స్పెషల్ డెవలప్‌మెంట్ కమిషన్(ఎస్‌డీసీ) చైర్మన్, ఇతర మండల స్థాయి ఎస్సీ, ఎస్టీ చైర్మన్లను గురువారం సన్మానించారు. ఈ మేరకు పట్టణంలోని సంతపేట రెగ్యులేటెడ్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎస్‌డీసీ సలహాదారు ప్రదీప్ మాఝి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ లింగరాజ్ పండా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ అధ్యక్షుడు జి.తిరుపతిరావు, జిల్లా ఎస్‌డీసీ చైర్మన్ మరియం రైతో, ఉపాధ్యక్షుడు(ఎస్‌డీసీ) ధనేశ్వర భుయాన్, మోహానా చైర్మన్ హదియా ఖోండో, ఐటీడీఏ పీఓ ఫాల్గుణి మాఝి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాఝి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సమితి కేంద్రాల్లో ఉన్నత పాఠశాలలు 5టీ కార్యచరణలో భాగంగా స్మార్ట్ క్లాసులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలలో ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని తొమ్మిది ఆదివాసీ జిల్లాల్లో ఎస్‌డీసీ చైర్మన్లను ఏర్పాటుచేసి, విద్య, స్వయం ఉపాధి కల్పించడానికి సీఎం నవీన్ పట్నాయక్ కృషి చేస్తున్నారన్నానరు. అనంతరం బెత్తగుడ వద్ద జవహర్ నవోదయ పాఠశాలలో ఇటీవల విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేడీ సీనియర్ నాయకులు డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ నాయక్, గుమ్మా బ్లాక్ అధ్యక్షురాలు సునేమి మండళ్, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, పర్లాకిమిడి పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి తదితరులు పాల్గొన్నారు.


సభను ప్రారంభిస్తున్న ప్రదీప్ మాఝి, జడ్పీ చైర్మన్ తిరుపతిరావు, అధికారులు

క్లుప్తంగా

జీడి తోటలు దగ్ధం


కాలిపోయిన జీడి తోటలను పరిశీలిస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్, బాధిత రైతులు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస గ్రామంలో బుధవారం రాత్రి జీడి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన ఇశాయి దుర్గమ్మ, పొగిరి రమణమ్మ, అదపాక రాముడమ్మలకు చెందిన ఆరు ఎకరాల్లోని జీడి తోటలు కాలిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో కష్టపడి మొక్కలు వేసుకుని తోటలను కంటికి రెప్పలా పెంచుకున్నామని, తీరా పంట పూత సమయంలో కాలిపోవడం దారుణమని వాపోయారు. ఈ ప్రమాదం ఎలా సంభవించిందో తెలియరాలేదు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌తో ఎస్సై రాజేష్

వేపాడ: మండలకేంద్రం వేపాడలో ఇసుక ట్రాక్టర్‌ను వల్లంపూడి ఎస్సై ఎస్.రాజేష్ పట్టుకుని కేసు నమోదు చేశారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి నుంచి విజయనగరం జిల్లా వేపాడ వస్తున్న ఇసుక ట్రాక్టరుకు అనుమతులు లేకపోవడంతో ఇసుకతోపాటు ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. ట్రాక్టర్ యజమానితోపాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

దర్యాప్తు వేగవంతం చేయాలి

- డీఎస్పీ మోహనరావు


ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మోహనరావు

వంగర: కొండచాకరాపల్లిలో వృద్ధురాలు గంట చిన్నమ్మి హత్య కేసు వేగవంతం చేయాలని బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం గ్రామంలో పర్యటించారు. ఘటన జరిగిన ప్రదేశంతోపాటు గ్రామంలో పర్యటించి ఆరా తీశారు. ఘటనకు బాధ్యులైన నిందితులను గుర్తించాలని, కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావును ఆదేశించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

83 మద్యం బాటిల్స్ స్వాధీనం


ఎస్సై రాజేష్ అదుపులోకి తీసుకున్న నిందితుడు

గరుగుబిల్లి: మండలంలోని కొత్తపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బి.సత్యనారాయణ, ఎన్.భీముడులను అదుపులోకి తీసుకొని వారివద్ద ఉన్న 83 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. ఈమేరకు వారిపై కేసు నమోదుచేసి తదుపరి చర్యల నిమిత్తం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే సమాచారం తమకు అందించాలని ప్రజలను కోరారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు 12 మంది ఎంపిక


జాతీయస్థాయి పోటీలకు ఎంపిక తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రావణి

విజయనగరం: తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈనెల 24 నుంచి 28 వరకు జరగనున్న 5వ జాతీయ స్థాయి క్యాడెట్‌పోటీలకు జిల్లా నుంచి 12 మంది అర్హత సాధించారు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి గురువారం అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి, జిల్లాకు పేరుతీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారిప్రసాద్, కోచ్‌లు పాల్గొన్నారు.

ఒకరి నేత్ర దానంతో.. ఇద్దరికి చూపు

- రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ


విజయనగరం ఫోర్ట్: మనిషి జీవితంలో కళ్లు అత్యంత ప్రధానమైనవి. అంతటి ప్రాధాన్యం గల నేత్రాలు లేని వారు జిల్లాలో ఎంతో మంది ఉన్నారు. కంటిచూపు లేని వారికి చూపును ప్రసాదించాలన్న సదుద్దేశంతో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాలో ఐడొనేషన్ సెంటర్ (నేత్ర సేకరణ కేంద్రం)ను ప్రారంభించింది. నేత్ర దానానికి అంగీకరించిన వారు చనిపోయిన తరువాత వారి ఇళ్లకు వెళ్లి నేత్రాలను సేకరిస్తున్నారు.


ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో నేత్రాలు భద్రం

రెడ్‌క్రాస్ ఐ డొనేషన్ సెంటర్ ద్వారా సేకరించిన నేత్రాలను విశాఖపట్నంలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలోని ఐ బ్యాంక్‌లో భద్రపరుస్తున్నారు. కంటి చూపు కోల్పోయిన వారికి కార్నియా అమర్చిన ప్పుడు ఐ బ్యాంక్‌లో భద్రపరిచిన నేత్రాలను వినియోగిస్తూ ఎంతో మందికి చూపును ప్రసాదిస్తున్నారు.

ఐదుగురి నుంచి నేత్రాల సేకరణ

2022 డిసెంబర్ 13 వతేదిన ఐడొనేషన్ సెంటర్‌ను కలెక్టరేట్ సమీపంలో ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మెరకముడిదాం మండలం గర్భాం, విజయనగరంలోని గాజులరేగ, మంటపం వీధి, కామాక్షి నగర్, చీపురుపల్లి ప్రాంతాల నుంచి నేత్రాలు సేకరించారు. మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలను 24 గంటల లోగా సేకరించాలి. కాని రెడ్ క్రాస్ సొసైటీ ఐడోనేషన్ సెంటర్ సిబ్బంది గంట, గంటన్నర లోగా నేత్రాలను సేకరిస్తున్నారు. నేత్రాల సేకరణపై శిక్షణ పొందిన అఫ్తాలమిక్ అసిస్టెంట్స్ ఇద్దరు ఉన్నారు. నేత్రాల సేకరణతో పాటు రెడ్ క్రాస్ సొసైటీ వారు పిల్లల సంరక్షణ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు కంటి సమస్యలపై ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వారితో కలిసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో పిల్లల సంరక్షణ కేంద్రాలు 20 ఉన్నాయి. వాటిలో ఇప్పటివరకు 19 కేంద్రాల్లోని 818 పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 46 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వారికి త్వరలోనే కంటి అద్దాలు అందించనున్నారు. నేత్ర దానం చేయదలచిన ఫోన్ 9848608101నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.


రెడ్ క్రాస్ ఐ డొనేషన్ సెంటర్


నేత్రాలను సేకరిస్తున్న అఫ్తాలమిక్ టెక్నీషియన్

నేత్రదానంపై అవగాహన పెరగాలి



నేత్ర దానంపై ఇప్పటికీ చాలా మందికి అవగాహన లేదు. అపోహల కారణంగా నేత్ర దానానికి ముందుకు రావడం లేదు. అన్ని దానాల కన్నా నేత్ర దానం గొప్పది. ఒకరి నేత్ర దానంతో ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చు. నేత్ర దానం చేస్తానని ఫోన్ వచ్చిన వెంటనే సిబ్బందిని పంపించి నేత్రాలను సేకరిస్తున్నాం. నేత్రదానం ఎంత ఎక్కువ మంది చేస్తే అంత ఎక్కువ మందికి చూపును ప్రసాదించవచ్చు. చనిపోయిన వారి కళ్లు ఈ ప్రపంచంలోని అందాలను ఎల్లప్పుడూ చూస్తూనే ఉంటాయి.

కేఆర్‌డీ ప్రసాద రావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్

కనక మహాలక్ష్మికి బంగారు ఆభరణాలు

- రూ.6.5 లక్షలతో తయారీ
- మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి 113 గ్రాముల బంగారు ఆభరణాలను బహూకరించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమ్మవారికి బహూకరించనున్న బంగారు ఆభరణాలను భార్య వెంకటనర్సమ్మతో కలిసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ కనకమహలక్ష్మి అమ్మవారికి ఈ నెల 26న అమ్మవారి జాతర సందర్భంగా రూ.6.50 లక్షల విలువైన 113 గ్రాములు బంగారు ఆభరణాలు అందజేయనున్నట్లు చెప్పారు. అందులో భాగంగా వంద గ్రాముల పుస్తెల తాడు, 40 గ్రాముల కిరీటానికి ఇరువైపులా సూర్య చంద్రుల ప్రతిమలు, 22 గ్రాముల కనుబొమ్మలు, బొట్టు, నత్తు, బోలాకులు చేయించినట్లు చెప్పారు.


బంగారు ఆభరణాలు చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు దంపతులు

రెండు పీహెచ్‌సీలకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్స్


ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ చూపిస్తున్న డీఎంహెచ్ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: పీహెచ్‌సీల్లోని అన్ని విభాగాల్లో ఉత్తమ సేవలు అందించినందుకుగాను వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఉమ్మడి జిల్లాలోని తెర్లాం మండలం పెరుమాళి పీహెచ్‌సీ, సీతానగరం మండలం పెదంకలాం పీహెచ్‌సీలకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్లు వచ్చాయి. ఈ మేరకు కేంద్ర కుటుంబ సంక్షేమశాఖ ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్) సర్టిఫికెట్లు జారీచేసింది. ఆ సర్టిఫికెట్లు గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరాయి. పీహెచ్‌సీల్లో వైద్యులు, స్టాఫ్‌నర్సు, సౌకర్యాలు, ప్రసవాలు, వ్యాక్సినేషన్ తదితర అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఎన్‌క్యూఏఎస్ టీమ్ పీహెచ్‌సీలను పరిశీలిస్తుంది. ఆరు అంశాల్లో ప్రతి అంశానికి సంబంధించి 100 మార్కులకు కనీసం 70 మార్కులు వచ్చిన పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ జారీ చేస్తారని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ రమణకుమారి తెలిపారు.

నేర పరిశోధనలో ప్రమాణాలు పాటించండి

- సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మికుమారి

విజయనగరం ఫోర్ట్: నేర పరిశోధనలో ప్రమాణాలను పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఎవిడెన్స్ రూపకల్పలో వైద్యులు ధ్రువీకరించే నివేదికలను బట్టి కోర్టులలో ఇచ్చే తీర్పు ఆధారపడి ఉంటుందన్నారు. క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ రిపోర్టులు ఇచ్చే ముందు వైద్యులు లోతుగా పరిశీలించి కచ్చితమైన నివేదిక జతచేయాలని సూచించారు. నేర పరిశోధనలో విధి, విధానాలు తు.చ తప్పకుండా పాటించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను నేరస్తుడు తప్పించుకోకూడదని, వైద్యుడు ఇచ్చే నివేదికపై తుది తీర్పు ఆధార పడి ఉంటుందని తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలూరి రఘురామ్ పాల్గొన్నారు.

18న ప్రత్యేక లోక్ అదాలత్

ఉమ్మడి జిల్లాల్లో మార్చి 18న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్ కేసులతో పాటు కుటుంబ తగాదాలు, ఇతర వివాదాలను పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్‌గా దుర్గయ్య

విజయనగరం, మన్యం జిల్లాల శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్‌గా విశ్రాంత న్యాయమూర్తి గరికిన దుర్గయ్య నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఉత్తర్వులు జారీచేసింది. ఐదేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగుతారు.

బ్యాలెట్ బాక్సుల పరిశీలన


బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న డీఆర్ఓ వెంకటరావు

పార్వతీపురం: శాసనమండలి ఎన్నికలకు వినియోగించేందుకు కలెక్టరేట్‌లోని దివ్యాంగుల స్పందన హాల్‌లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు గురువారం పరిశీలించారు. పోలింగ్‌కు అవసరమైన సామగ్రి సిద్ధం చేసే ఏర్పాట్లపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరిచేందుకు సెల్లార్‌లో ఏర్పాటుచేస్తున్న తాత్కాలిక స్ట్రాంగ్ రూం పనులను తనిఖీ చేశారు.

సామూహిక గృహప్రవేశ లక్ష్యం 29వేల ఇళ్లు

- గృహ నిర్మాణ శాఖ ఈఈ శ్రీనివాస్

తెర్లాం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా విజయనగరం, బొబ్బిలి సబ్ డివిజన్ల పరిధిలో 29వేల 96 ఇళ్లను ఉగాది రోజున సామూహిక గృహ ప్రవేశానికి సిద్ధం చేయడమే లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని కుసుమూరులో గల జగనన్న ఇళ్ల లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించేందుకు గురువారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన పరిధిలో సామూహిక గృహప్రవేశానికి లక్ష్యంగా ఇచ్చిన ఇళ్లలో ఇంతవరకు 19వేల 606 ఇళ్లు పూర్తి చేశామని, మిగిలిన 9వేల 690ఇళ్లను మార్చి 22లోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బొబ్బిలి డివిజన్‌లోని బొబ్బిలి పట్టణం, బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల్లో 6,295ఇళ్లు సామూహిక గృహ ప్రవేశానికి లక్ష్యం కాగా ఇంతవరకు 4,459ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. వివిధ దశల్లో ఉన్న 1,836 ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేస్తామన్నారు. తెర్లాం మండలంలో ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, మండలంలో సామూహిక గృహప్రవేశ లక్ష్యం 1,211ఇళ్లు కాగా, ఇంతవరకు 900 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లు మార్చి 22లోగా పూర్తి చేసి సామూహిక గృహప్రవేశం నిర్వహిస్తామని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్లన్నీ ప్రారంభించి, సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయనతోపాటు గృహ నిర్మాణశాఖ మండల ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈఏ అక్కునాయుడు, కుసుమూరు సర్పంచ్ తెంటు సత్యంనాయుడు ఉన్నారు.


కుసుమూరులో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ శ్రీనివాస్

కాశీయాత్ర నుంచి వస్తూ..

వీరఘట్టం: స్థానిక సెగిడివీధికి చెందిన పూతి సింహాచలం (55) కాశీ యాత్రకు వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో వీరఘట్టంలో తీవ్ర విషాదం నెలకొంది. కాశీయాత్ర నుంచి తిరిగి వస్తుండగా భువనేశ్వర్‌లో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింహాచలం మృతి చెందాడు. కుటుంబసభ్యులు మృతదేహాన్ని వీరఘట్టం తీసుకువచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.


పూతి సింహాచలం (ఫైల్)


ఓదూరి నాగన్న (ఫైల్)

కారు ఢీకొని వృద్ధుడు..

భోగాపురం: మండలంలోని లింగాలవలస వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా బుధవారం రాత్రి విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న కారు ఢీకొనడంతో వృద్ధుడు ఓదూరి నాగన్న(77) మృతి చెందినట్లు హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. లింగావలసకు చెందిన నాగన్న సొంత పనిమీద తగరపువలస వెళ్లాడు. పనిముగించుకుని ఆటోలో తిరిగి బయలుదేరాడు. ఈ క్రమంలో లింగాలవలస జంక్షన్‌లో ఆటో దిగి జాతీయ రహదారిని దాటుతుండగా కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం అందుకున్న బంధువులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని తగరపువలస ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఎర్రమ్మతో పాటు ఒక కూమారు డు, కూమార్తె ఉన్నారు. మృతుడి మనుమడు శివ ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

రిలయన్స్ స్టోర్‌లో ప్రమాదం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రూ.2లక్షల ఆస్తినష్టం

గజపతినగరం: మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన రిలయన్స్ స్టోర్‌లో గురువారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. నూతనంగా నిర్మాణం చేపట్టిన రిలయన్స్ స్టోర్ ఈనెల 26న ప్రారంభం కానుంది. ఈ తరుణంలో యజమానులు స్టోర్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తూ ముస్తాబు చేస్తున్నారు. గురువారం వేకువ జామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు చెల రేగాయి. స్టోర్‌లో ఎగసి పడుతున్న మంటలను చూసి బయట ఉన్న సెక్యూరిటీ గార్డు చిట్టిబాబు అప్రమత్తమై రిలయన్స్ స్టోర్‌లో నిద్రిస్తున్న దుర్గాప్రసాద్‌ను లేపి మంటల నుంచి రక్షించాడు. వారిద్దరూ మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోవడంతో పక్కనే ఉన్న అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారి రవిప్రసాద్ సిబ్బందిని పంపించి మంటలను అదుపు చేయించారు. అప్పటికే కంప్యూటర్, ల్యాప్‌టాప్, బట్టలు, తలగడలు, విద్యుత్ లైట్లు తదితర సామగ్రి కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపకశాఖ అధికారి రవిప్రసాద్ అంచనా వేశారు.


రిలయన్స్ స్టోర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఎగసి పడుతున్న మంటలు

మడ్డువలసలో చేపలవేటపై ఆంక్షలు

- రూ.21 లక్షల లీజు బకాయిలు చెల్లించాలని ఆదేశం
- నోటీసులు జారీచేసిన మత్స్యశాఖ అధికారులు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో చేపలవేటపై మత్స్యశాఖ అధికారులు ఆంక్షలు విధించినట్టు రాజాం మత్స్యశాఖ సహాయ తనిఖీదారు సీహెచ్‌వీవీ ప్రసాద్ గురువారం తెలిపారు. దీనిపై తహసీల్దార్, ఎస్సై, ఎంపీడీఓలతో పాటు మత్స్యశాఖ సొసైటీకి సమాచారం అందించినట్టు చెప్పారు. ప్రాజెక్టు పరిధిలో కొట్టిశకు చెందిన శ్రీ సీతారామ స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలో 25 గ్రామాలకు చెందిన 574 మంది మత్స్యకారులు చేపల వేటసాగిస్తూ జీవిస్తున్నారు. అయితే, 1428వ ఫసలీకి సంబంధించి రూ.9,40,649ల లీజు రుసుము, 1431వ ఫసలీకి సంబంధించి రూ.12,44,326 లీజు రుసుము కలిపి రూ.21,84,975లు ప్రభుత్వానికి చెల్లించలేదు. లీజు సొమ్మును జమచేసినంత వరకు ఆంక్షలు కొనసాగుతాయని స్పష్టంచేశారు.

ఆధ్యాత్మిక శోభ


కుంకుమపూజలు చేస్తున్న మహిళా భక్తులు

రేగిడి: మండలంలోని కొమెర గ్రామంలో విద్యా గణపతి జ్ఞాన సరస్వతి సహిత షిర్డిసాయి మందిరం ప్రారంభోత్సవం గురువారం శాస్త్రోక్తంగా సాగింది. క్షీరాధివాసం, సూర్య నమస్కారాలు, ధాన్యాధివాసం, పంచశయాది, అష్టదిగ్బలి, స్నపనం, కుంకుమ పూజలను అంపోలు రుద్రకోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. వందలాది మంది భక్తులు పూజల్లో పాల్గొని ఆధ్యాత్మిక చింతనతో గడిపారు

పందిర సాగు.. బహు బాగు


గురండిలో వేసిన బీర, దోస పందిర పాదులు

- రైతు ఇంట దిగుబడుల పంట
- 50 శాతం సబ్సిడీపై రైతుకు ఊరట
- ఉద్యానవన అధికారుల ప్రోత్సాహం

భామిని:

వ్యవసాయ రంగంలో రైతుకు లాభాలు చేకూర్చే పంటలలో కూరగాయలది ప్రత్యేక స్థానం. అవే కూరగాయలను శాశ్వత పద్ధతిలో పందిరలు వేసి సాగు చేస్తే లాభాలు రెండింతలు కావడం ఖాయమని హార్టీకల్చర్ శాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. పంట పొలాల్లో శాశ్వత పందిళ్ల విధానంలో పాదు కూరగాయలు సాగుతో, అధిక లాభాలు సాధించడానికి మార్గాలు చూపుతున్నారు. చీడపీడల నివారణ, వంకర టింకర తనం లేకుండా నాజూకైన కూరగాయల దిగుబడికి పందిర సాగు దోహద పడుతుంది. తరుగుదల లేని నాణ్యత గల పంటలు పొందడంతో పాటు మార్కెట్‌లో ఆశించిన ధరలు కూడా చేజిక్కుతాయి.

బీర, చిక్కుడు, కాకర, దొండ, దోస, పొట్ల, గోరుచిక్కుడు, బరబటీల పొట్ల, ఆనప, గుమ్మడి పంటల వంటి పాదు కూరగాయల సాగును ప్రోత్సాహిస్తున్నారు. పందెర పంటలతో పాటు, పందెర్ల క్రింద తక్కువ కమతం గల రైతు సహితం శాశ్వత పందిరల పద్ధతిలో బహుళ కూరగాయలు సాగు సాధ్యపడుతుందంటున్నారు. పందెర క్రింద తక్కువ కాలంలో వచ్చే పంటలు పండించుకోవచ్చు. పచ్చిమిర్చి, ఉల్లి, ముల్లంగి, క్యాబేజీ, ఎర్రకందమూలం, ఆకుకూరలు వంటి పంటలు సాగుకు అనువుగా ఉంటుంది. ఎకరంలో శాశ్వత పందిర కూరగాయల సాగుతో ఏడాదికి రూ.రెండు నుండి మూడు లక్షల వరకు రైతుకు లాభాలు సాధ్యపడుతుందని చెబుతున్నారు.


సుస్థిర వ్యవసాయ విధానంలో పందిర బీర తరలింపునకు సిద్ధం చేస్తున్న వలస రైతు

ఐటీడీఏ పరిధిలో..

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని భామిని, కొత్తూరు, సీతంపేట మండలాల్లో హార్టీకల్చర్ శాఖ ఆధ్వర్యంలో శాశ్వత పందిర పథకం అమలు చేస్తున్నారు. ఇప్పటికే భామిని మండలం సొలికిరి, సతివాడ, కొత్తూరు మండలం సిరుసువాడ, కుంటిబద్రలలో అమలు చేశారు. ఏభై శాతం సబ్సీడీపై శాశ్వత పందిరలు మంజూరు చేస్తున్నారు. ఎకరం నుండి పావు ఎకరం వరకు భూమి గల చిన్నకారు రైతులకు కూడా పందెర సాగు సాధ్యపడుతుంది. ఈ పద్ధతిలో సిమెంటు పోల్స్‌ను భూమి చూట్టూ వేసి పైభాగంలో ఇనుప చువ్వలను పందిరగా వేస్తారు. సాధారణంగా కర్రలతో వేసే పందిర ప్రతీ ఏడాది పాడై కొత్తగా వేసుకోవడంతో ఖర్చు పెరుగుతుంది. పందెరపై ఉన్న పంట పాడవుతుంది.

జీవిత కాలం పండించుకోవచ్చు..



ఒక ఎకరం స్థలంలో సుమారు రూ.2లక్షల వ్యయంతో పందిర వేసుకోవచ్చు. ఇందులో ఏభై శాతం అంటే రూ.1లక్ష వరకు ప్రభుత్వం సబ్సిడీ చెల్లిస్తుంది. అర ఎకరంలో రూ.1లక్షతో పందిరలు వేసుకోవచ్చు. ఇందులో 50వేలు సబ్సిడీ చెల్లిస్తున్నది. ఇరవైదు సెంట్లలో రూ.50వేలుతో పందెర వేసుకోవచ్చు. 25వేలు సబ్సిడీ పొందవచ్చు. ఆసక్తి గల రైతులు నేరుగా సంప్రదించవచ్చు. భూమి చూసి సబ్సిడీ మంజూరు చేస్తాం.

– తమ్మినేని అమరేశ్వరి, హెచ్‌టీఓ, సీతంపేట

లాభాల పంట



పందిర విధానంలో ఇనుప పందిరలు వేశాం. సుస్థిర వ్యవసాయ విధానంలో కూరగాయల సాగు చేస్తున్నాం. గతం కన్నా రెండింతలు దిగుబడి సాధిస్తున్నాం. అన్ని రకాల కూరగాయలు పండిస్తున్నాం. దూర ప్రాంతాలకు డిమాండ్‌పై పంపిస్తున్నాం. నాణ్యమైన కూరగాయలు దిగుబడికి ఆలవాలంగా మారాయి. వరుస పాదుల సాగు పెంచుతున్నాం.

– చంద్రశేఖర రెడ్డి, కూరగాయల రైతు, గురండి